పనులు పూర్తికాక ముందే పగుళ్లు

దెబ్బతిన్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ స్లాబ్


స్లాబ్‌కు వచ్చిన పగుళ్లు, లీకేజీ, తేమ

వెంగళరావునగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పనులు పూర్తికాక ముందే మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ స్లాబ్ దెబ్బతిన్నది. వెంగళరావునగర్ డివిజన్ వెంగళరావునగర్ కాలనీ అయ్యప్ప మైదానంలో సుమారు రూ.5.40 కోట్లతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు 2022 జూన్ 11న అప్పటి ఎమ్మెల్యే, దివంగత మాగంటి గోపీనాథ్ శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు స్లాబ్ మాత్రమే వేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో గడిచిన కొంతకాలంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో స్లాబ్‌కు పగుళ్లు వచ్చి మొదటి అంతస్తుపైన నీరు నిలిచి కిందికి, అక్కడ కూడా నీరు నిలిచి గ్రౌండ్ ఫ్లోర్ లోని కొన్ని ప్రాంతాల్లో స్లాబ్ లీకేజీ అయి నీరు కారుతోంది. స్థానికులు ఇటీవల గ్రౌండ్ ఫ్లోర్‌లో వినాయక చవితి సందర్భంగా గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేశారు. అప్పుడే వారికి స్లాబ్‌కు పగుళ్లు, నీరు కారడం కనిపించింది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పనులు నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు


ఎల్‌బీ నగర్ మహాకాళి ఆలయంలో జరిగిన దేవీ నవరాత్రి పూజలో మాగంటి సునీతగోపీనాథ్, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, నాయకుడు నర్సింగ్ దాస్


రహ్మత్‌నగర్‌లో పూజాధికాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి


గాయత్రిదేవి అలంకరణలో జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి


గాయత్రిదేవి అలంకరణలో శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబ అమ్మవారు


గాయత్రిదేవి అలంకరణలో అమీర్‌పేట సోనాబాయి అమ్మవారు


బాపునగర్ సేవాబాయి సేవా సంఘం నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్న జాతీయ షెడ్యూల్డ్ తెగ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ దంపతులు


ఎర్రగడ్డ జనప్రియ మెట్రోపాలిస్ క్లాసిక్ హోమ్స్‌లోని దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, అపార్ట్‌మెంట్ వాసులు రాధిక, పద్మ, రేణుక, స్వప్న, సౌమ్య, కీర్తన


ఎస్పీఆర్‌హిల్స్ ఎస్ఎస్‌బీనగర్‌లో జైమాత యూత్ అసోసియేషన్ టీమ్ ఏఐ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారి విగ్రహం

బంజారాహిల్స్/ఖైరతాబాద్/యూసుఫ్‌గూడ/అమీర్‌పేట/ఎర్రగడ్డ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి ఉదయం 3 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం పూజాధికాలు చేశారు. అమ్మవారికి గాయత్రిదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అమీర్‌పేట సోనాబాయి అమ్మవారిని, ఎల్లారెడ్డిగూడ విజయదుర్గ అమ్మవార్లను గాయత్రిదేవీగా అలంకరణ చేసి పూజాధికాలు నిర్వహించారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. ఓ వైపు దసరా ఉత్సవాలు మరో వైపు బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా శ్రీవారికి తిరుమల తరహాలో ప్రతీ రోజు వాహన సేవ నిర్వహించనున్నారు.


ఖైరతాబాద్ న్యూ సీబీబీ క్వార్టర్స్‌లోని దుర్గాభవాని ఆలయంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు


బంజారాహిల్స్ కనకదుర్గ ఆలయంలో పూజాధికాలు నిర్వహించిన హైకోర్టు న్యాయమూర్తి మాధవిదేవి


అమీర్‌పేట కనకదుర్గ ఆలయంలో బాలాత్రిపురసుందరిదేవి అలంకరణ


అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో బాలాత్రిపురసుందరిదేవిగా రాజరాజేశ్వరీదేవి


మంగళగౌరిదేవిగా అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ


బాధితులతో మాట్లాడుతున్న రంగనాథ్

ముంపు ముప్పు తప్పించండి..!

● హైడ్రాకు ఫిర్యాదులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైడ్రా ప్రజావాణికి మంగళవారం 49 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 30కిపైగా నాలాల ఆక్రమణలు, వరద ముంపునకు సంబంధించినవే అని సంస్థ పేర్కొంది. యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌లో మురుగు, వరద నీటి ముంపు ఉందని, నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడమే ఇందుకు కారణమని స్థానికులు కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. అమీన్‌పూర్‌లో బందంకొమ్ము చెరువు మళ్లింపుతో పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది కాలనీలు వరద నీటితో ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..


బతుకమ్మ ఉత్సవాలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆహ్వానిస్తున్న జెక్ కాలనీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రభ, అన్నపూర్ణ, కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ తదితరులు


జూబ్లీహిల్స్‌లో దాండియా ఆడుతున్న మహిళలు


గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెల, కార్పొరేటర్లు విజయారెడ్డి, బొంతు శ్రీదేవి తదితరులు

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

ఎర్రగడ్డ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాజీవ్ నగర్ శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజీవ్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.ఇందర్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గంతో ఎన్నికల పరిశీలకులు రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా పీఎస్‌జీ కృష్ణశర్మ, కార్యదర్శిగా ఎం.విజయ ఆనంద్, సహాధ్యక్షులుగా ఎస్.భుజంగరావు, కోశాధికారిగా ఎం.బద్రుద్దీన్, ఉపాధ్యక్షులుగా కుటుంబరావు, సంయుక్త కార్యదర్శిగా డి.వెంకట్రావును ఎన్నుకున్నారు. అదేవిధంగా పంజాగుట్ట శాఖ అధ్యక్షుడిగా వి.సదానందం, కార్యదర్శిగా వి.రాధాకృష్ణమూర్తి, కోశాధికారిగా పి.సీతారామయ్యను ఎన్నికల అధికారి టి.నాగేశ్వరరావు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు స్థానిక నాయకులు పి.శ్యామ్‌రావు, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తేనే ఉప ఎన్నికలో విజయం

● ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రమణ, మాగంటి సునీత తదితరులు

బంజారాహిల్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేస్తేనే ఉప ఎన్నికలో విజయం సాధ్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. గణపతి కాంప్లెక్స్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం శ్రీనగర్‌కాలనీ బూత్ స్థాయి కమిటీ సమావేశం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోనే బీఆర్ఎస్‌కు అత్యధిక కార్యకర్తల బలం ఉంది జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే అని గుర్తు చేశారు. నాయకులు ప్రతి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటూ ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాలు కొనసాగించాలంటే పార్టీ శ్రేణులంతా ఒక్కతాటి మీదకు వచ్చి పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, కార్పొరేటర్లు, బూత్‌స్థాయి నాయకులు పాల్గొన్నారు.

వేతనాల కోసం సెక్యూరిటీ గార్డుల ఆందోళన


నిరసన తెలుపుతున్న సెక్యూరిటీగార్డులు

నిమ్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేతనాలు ఇవ్వాలని కోరుతూ నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సెక్యూరిటీగార్డులు మంగళవారం ఆందోళన చేశారు. గతంలో సాయిరామ్ సెక్యూరిటీ సర్వీస్ ఏజెన్సీ మూడు నెలలు వేతనాలు ఇవ్వకుండా పోయింది. దీనిస్థానంలో కార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ వచ్చింది. దీని ద్వార వేతనాలు ఇస్తామని నిమ్స్ యాజమాన్యం హామీ ఇచ్చింది. కాగా, పాత బకాయిలు ఇవ్వకపోగా కార్తికేయ ఏజెన్సీ కూడ ఆగస్టు వేతనం ఇవ్వలేదు. దీంతో సెక్యూరిటీగార్డులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా సెక్యూరిటీగార్డులను పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కాసేపటికి పంపించారు.

జీతాలు ఇచ్చాం : నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

సెక్యూరిటీగార్డులకు జీతాలను విడుదల చేశామని నిమ్స్ డైరెక్టర్ ఎన్.బీరప్ప తెలిపారు.

శ్యామ్‌రావుకు ఘన నివాళి



శ్యామ్‌రావుకు నివాళులర్పిస్తున్న పంచాయతీ కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మాజీ మేయర్, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి ఎంఆర్ శ్యామ్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా వీర్‌నగర్ పంచాయతీ కమిటీలోని ఆయన విగ్రహానికి కమిటీ అధ్యక్షుడు టి.ఘట్టయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు బి.మనోహర్‌బాబు, ప్రతినిధులు విద్యాసాగర్, శశిధర్ పాల్గొన్నారు.

350వ షహీది శతాబ్దినగర్ కీర్తన్ యాత్ర

● రేపు నగరానికి చేరిక

పంజాగుట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదవ సిక్కు గురువు శ్రీ గురు తేగ్ బహదూర్ సాహిబ్‌జీ 350వ షహీది దివస్ సందర్భంగా నిర్వహిస్తున్న 350వ షహీది శతాబ్దినగర్ కీర్తన్ యాత్ర ఈనెల 25న నగరానికి చేరుకోనుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ(ఎస్జీపీసీ) ఆధ్వర్యంలో అసోంలోని ధుబ్రి గురుద్వారాలో గత నెల 21న ప్రారంభమైన ఈ యాత్ర దేశ వ్యాప్తంగా 23 రాష్ట్రాల మీదుగా సాగుతోంది. నవంబరు 23న పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్ వద్ద ముగియనుంది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సెంట్రల్ కమిటీ ఆఫ్ గురుద్వారా సాహిబన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఎస్.గురుచరణ్‌సింగ్ బగ్గా, ప్రధాన కార్యదర్శి మంజీత్ సింగ్, కమిటీ సభ్యులతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్ హెచ్.సింగ్, సలహాదారు ప్రీతం సింగ్, ఇంద్రసింగ్, బల్దేవ్‌సింగ్ బగ్గా, చేతన్ సింగ్, హర్పాల్ సింగ్ పాల్గొన్నారు.

అకడమిక్ కౌన్సిలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

పంజాగుట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో అకాడమిక్ కౌన్సిలర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యయన కేంద్రం చైర్మన్ ప్రొఫెసర్ బి. రాజేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమిక్ కౌన్సిలర్స్ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అక్టోబరు 10వ తేదీలోపు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.


మైత్రివనం ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

నాలాపై చిరు వ్యాపారాలు, డబ్బాల తొలగింపు

అమీర్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట సత్యం మాల్ నుంచి మైత్రివనం వరకు నాలాపై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారాలు, డబ్బాలను మంగళవారం జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. దాదాపు 15 వరకు ఆక్రమణలను తొలగించే సమయంలో వాటిని నిర్వహిస్తున్న మహిళలు అడ్డుపడ్డారు. అయినప్పటికీ అధికారులు తొలగించారు. అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ చిరు వ్యాపారులకు మద్దతుగా నిరసనకు దిగారు. నగరం మొత్తం రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణలుంటే వాటిని వదిలిపెట్టి మహిళలు నిర్వహిస్తున్న చిన్న, చిన్న డబ్బాలను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని పేర్కొన్నారు.

డ్రైనేజీ, వాటర్ వర్క్స్ పనులకు నిధులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధుల నుంచి యూసుఫ్‌గూడ, ఎల్ఎన్ నగర్ బోరింగ్ గల్లీలో డ్రైనేజీ లైన్ పనులకు రూ.10 లక్షలు, రహ్మత్‌నగర్‌లో డ్రైనేజీ, వాటర్ వర్క్స్ పనులకు రూ.2.2 కోట్లు మంజూరు చేసినట్లు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌ను ఆధునీకరించాలని, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరుతూ జలమండలి జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావుకు బీజేపీ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణ, షర్మిల జాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, సునీత, కాట్రాజ్ రాజా, అనంతలక్ష్మి, సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ప్రదర్శన


ప్రదర్శనలో సందర్శకుల సందడి

బంజారాహిల్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి సీజన్ మొదలైంది. సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండడంతో సంప్రదాయం ఉట్టిపడేలా ఫ్యాషనబుల్‌గా ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో శ్రీనగర్‌కాలనీలోని ఇండియన్ సిల్క్ గ్యాలరీ ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్‌బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఈనెల 25 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆయుర్వేద వైద్యాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

పంజాగుట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్య విధానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని రాష్ట్ర ఆయుష్ కమిషనర్ శ్రీకాంత్‌బాబు అన్నారు. మంగళవారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఆడిటోరియంలో రాష్ట్ర ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్ విభాగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య పెరగాలని, అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. ఆయుర్వేద వైద్య విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుర్వేదం, హోమియో, యునానీ విభాగం అదనపు సంచాలకులు డాక్టర్ పరమేశ్వర్ నాయక్, డాక్టర్ లింగరాజు, డాక్టర్ వసంతరావు, ఆయుష్ ఉప సంచాలకులు స్వరూపారాణి, ఎర్రగడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమత కస్తూరి, విద్యార్థుల సలహాదారులు డాక్టర్ నరసింహ, సీనియర్ వైద్యులు డాక్టర్ యశోద, వైద్యేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ


సలీం జావెద్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహ్మద్ సలీం జావెద్ సతీమణి షరీన్ ఫాతిమా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ ఎర్రగడ్డలోని నివాసంలో సలీం జావెద్ కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో మీర్జా షోయబ్ బేగ్, సయ్యద్ యూనుస్, అబ్దుల్ గఫార్ ఖాన్, మహ్మద్ షా నవాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, దూడల రవిగౌడ్, సర్దార్, పి.ఆకాష్ పాల్గొన్నారు.

నారాయణమ్మ కాలేజీలో ఇంజనీర్ల దినోత్సవం

● విద్యార్థులకు 'యంగ్ ఇంజనీర్' పురస్కారాలు


టెక్నికల్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(జీఎన్ఐటీఎస్)లో మంగళవారం ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక, సృజనాత్మక కార్యక్రమాలు ఆహూతులను అబ్బురపరిచాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్ కుమార్ పెద్దపల్లి మాట్లాడుతూ విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టి వృత్తిపరంగానూ, సంస్థ పరంగానూ అభివృద్ధిని సాధించాలని సూచించారు. బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్, అంత్రప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ రంగాల్లో క్రియాశీలకంగా పనిచేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వేడుకలో భాగంగా టెక్నికల్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రతీ విభాగం నుంచి ప్రతిభ కలిగిన విద్యార్థులకు 'యంగ్ ఇంజనీర్ అవార్డు'ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రసాద్‌రెడ్డి, డీన్‌లు, విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ దిల్‌సుఖ్‌నగర్ అధ్యక్షుడికి 5 స్టార్ అవార్డు



రాజశేఖర్‌కు అవార్డు అందజేస్తున్న నాగేశ్వరరావు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ దిల్‌సుఖ్‌నగర్ శాఖ అధ్యక్షుడు ఎం.రాజశేఖర్‌కు 5 స్టార్ అవార్డు దక్కింది. బాలంరాయిలోని డ్రీమ్ ల్యాండ్ గార్డెన్స్‌లో ఈ మధ్య జరిగిన ఓ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంప నాగేశ్వరరావు అవార్డును అందజేశారు. మంగళవారం ఎర్రగడ్డలో రాజశేఖర్ విలేకరులతో మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 హెచ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమంలో భాగంగా 50 పైచిలుకు ఉన్న క్లబ్‌లలో ఐదుగురు అధ్యక్షులకు 5 స్టార్ అవార్డులు అందజేశారని తెలిపారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే దిల్‌సుఖ్‌నగర్ లయన్స్ క్లబ్ శాఖను అన్ని రంగాల్లో ముందుంచడం వల్ల అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు.

దెబ్బతిన్న రహదారుల స్థానంలో సీసీ రోడ్లు

వెంగళరావునగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న, పాడైన రహదారుల స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య తెలిపారు.మధురానగర్ కాలనీ జి-బ్లాక్‌లో సీసీ రోడ్డు పనులను ఆమె మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, సమితి ప్రతినిధులు కమలాకర్‌రావు, తాహిర్, ఈ.నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు పవన్ ముదిరాజ్, సత్యనారాయణ, పూజారి బాలు, కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం పాటుపడాలి

బోరబండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం పార్టీ శ్రేణులంతా పాటుపడాలని బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ కోరారు. బోరబండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఖమ్మం కార్పొరేషన్ కార్పొరేటర్ మహ్మద్ ముస్తఫాతో కలిసి ఆయన మాట్లాడారు. అనంతరం బోరబండ డివిజన్ ఎస్ఆర్ఆర్‌పురం సైట్-2, 3, 4, 5, భారత్ నగర్, బాబాసైలానీ నగర్, స్వరాజ్ నగర్ బూత్ కమిటీ ఇన్‌చార్జీలతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్, మహేష్ కాసుల, తాహేర్, నిజాం, మహేందర్ పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రిలో మెరుగైన సేవలు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో మానసిక ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. దివీస్ లాబొరేటరీస్ హైదరాబాద్ సహకారంతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 12 వాటర్ ప్లాంట్లను ఆమె మంగళవారం ప్రారంభించారు. దివిస్ లాబొరేటరీస్ ప్రాజెక్ట్ అధిపతి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజ ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు నిరంతరం దివిస్ లాబొరేటరీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవోలు డాక్టర్ కౌసర్, డాక్టర్ శంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భవనాన్ని కూల్చివేస్తున్న రక్షణశాఖ అధికారులు

రక్షణ శాఖ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం

మారేడుపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని కంటోన్మెంట్ అధికారులు హెచ్చరించారు. కంటోన్మెంట్ డీఈవో దినేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పికెట్ ఎరుకల బస్తీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మంగళవారం తెల్లవారు జామున కూల్చివేశారు. కూల్చివేతల కార్యక్రమంలో అధికారులు వెంకన్న, రంజిత్, రాగేష్, శ్రీనాథ్, సుభాష్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

తిరుమలగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి తిరుమలగిరి విలేజ్‌లో పురాతన ఇల్లు సోమవారం రాత్రి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నిత్యావసర వస్తువులు ధ్వంసమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీ ముదిరాజ్ కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ద్వారా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మురళీ ముదిరాజ్


అడ్డగుట్టలో పర్యటిస్తున్న అధికారులు, బీజేవైఎం నేతలు

అడ్డగుట్టలో సమస్యల పరిష్కారానికి చర్యలు

అడ్డగుట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అడ్డగుట్టలో డ్రైనేజీలు పొంగుతున్నాయి. సెప్టిక్ ట్యాంకులు కూలిపోయాయని, నల్లపోచమ్మ ఆలయం, మసీదు వద్ద డ్రైనేజీ నీరు ఏరులై పారుతోందని ప్రజలు వాపోయారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం బీజేవైఎం అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్‌కుమార్ యాదవ్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు అడ్డగుట్టలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి మారేడుపల్లి డీజీఎం విద్యాసాగర్, ఏఈ స్రవంతి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఆశిష్, బీజేపీ, బీజేవైఎం నేతలు స్వామి, ప్రేమలత, రాజశేఖర్, రాజ్‌కుమార్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యుల సంఘం ప్రతినిధులు

మహబూబాబాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

అడ్డగుట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, కార్యదర్శి లాలూప్రసాద్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీ ఆస్పత్రిలోని ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన వైద్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ సూపరింటెండెట్ డాక్టర్ శ్రీనివాస్‌పై దాడిని ఖండించారు. గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ రాథోడ్ మాట్లాడుతూ వైద్యులపై దాడి తగదన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ కల్యాణచక్రవర్తి, వైద్యులు మురళి, వెంకటరమణి, రాంబాబు, వంశీకృష్ణ, దివ్య, కృపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ

మారేడుపల్లి, సెప్టెబరు 23, (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అంబేడ్కర్ నగర్ బస్తీ బురదమయంగా మారిందని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అన్నారు. సీపీఐ నాయకులు మంగళవారం బస్తీలో పర్యటించారు. బస్తీలో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాంపల్లి శ్రీనివాస్, గౌరీ నాగరాజ్, శ్రీహరి, గౌస్, కరీం, బాల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. బోయినపల్లి ఎస్ఐ గణేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌బోయినపల్లి గంగపుత్ర సంఘం కమిటీహాల్ గోడ పక్కన సుమారు 30 సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

వాయుసేన విశ్రాంత వింగ్ కమాండర్ ఇంట్లో చోరీ

అమీర్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాయుసేన విశ్రాంత వింగ్ కమాండర్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట శ్యామ్‌కరణ్ రోడ్డులో భారత వాయుసేన విశ్రాంత వింగ్ కమాండర్ ప్రణవ్ గార్గ్ నివసిస్తున్నాడు. తన ఇంట్లోని పూజ గదిలో 1.5 గ్రాముల బంగారు రుద్రాక్ష మాల, తలం బంగారు ఉంగరం, మూడు దీపం ఇత్తడి కుందులు కనిపించకపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. పసుపు రంగు చీర కట్టుకుని లోపలికి ప్రవేశించిన ఓ మహిళ చోరీ చేసినట్లు గుర్తించారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయత్రీదేవీ అలంకరణలో కనకదుర్గ అమ్మవారు


మంగళదేవీ అలంకరణలో చీదలబస్తీ రేణుకా ఎల్లమ్మ


లాల్‌బజార్ మహాకాళి దేవాలయంలో అమ్మవారి మూల విరాట్


పార్సీగుట్టలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ తదితరులు


బొల్లారం డౌటన్ బజార్‌లోని లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఈఓ, ఆలయ వ్యవస్థాపకుడు నిరంజన్ దంపతులు

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న నందమూరి వసుంధర దేవి, అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్


నేతాజీనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాతకు పూజలు చేసిన జై బజరంగ్ అసోసియేషన్ సభ్యులు


ముత్యాలమ్మ పోచమ్మ ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు


తుకారాంగేట్‌లో దుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో పూజలు నిర్వహించిన నిర్వాహకులు నర్సింగ్‌రావు, సాయిబాబా, గోవింద్, ప్రకాశ్, అశోక్, మధుగౌడ్, వీరేష్, సాయిలు, మహేష్, నగేష్ తదితరులు

సికింద్రాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లష్కర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సికిందాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం సహా పలు దేవాలయాలు భక్తజనంతో కళకళలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న బాలకృష్ణ సతీమణి

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని మంగళవారం ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాకృష్ణ సతీమణి వసుంధరదేవి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్ ఆమెకు ఆలయ చరిత్ర, అమ్మవారి ప్రాశస్త్యం గురించి వివరించారు.

బొల్లారంలో..

తిరుమలగిరి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో లలితా త్రిపుర సుందరీదేవి ఆలయం, లాల్ బజార్‌లోని మహాకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. మంగళవారం లలితా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో మహాగణపతి హోమం, పుణ్యాహవచనం, సంకల్ప పూజలు నిర్వహించారు. పూజల్లో దేవాలయ ఈఓ మహేందర్ రెడ్డి, దేవాలయ ఫౌండర్ పరుష నిరంజన్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

లాల్‌బజార్ మహాకాళి దేవాలయంలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ సేవా కమిటీ అధ్యక్షుడు మురళీ ముదిరాజ్, కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


లాల్‌బజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్న దేవాలయ సేవా కమిటీ అధ్యక్షుడు మురళీ ముదిరాజ్ తదితరులు

శ్మశానవాటికను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి

● పోలీసు అధికారులకు ఎమ్మెల్యే తలసాని ఆదేశం

పద్మారావునగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికను ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. బన్సీలాల్‌పేట డివిజన్ సీసీనగర్‌లో కుర్మసంఘం శ్మశానవాటికను ఆక్రమిస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన రెవెన్యూ, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులతో మంగళవారం సందర్శించారు. కొందరు వ్యక్తులు శ్మశానవాటికను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై తలసాని సికింద్రాబాద్ ఆర్డీవో సాయిబాబును వివరణ కోరగా.. ఈ స్థలం రికార్డుల ప్రకారం శ్మశాన వాటికగానే ఉందని, నిర్మాణదారుడు కోర్టు నుండి స్టే తీసుకున్నారని, కోర్టు స్టే ఇచ్చిన సర్వే నంబరు, శ్మశానవాటిక సర్వే నంబర్లు వేర్వేరుగా ఉన్నాయని ఆర్డీవో ఎమ్మెల్యేకు వివరించారు. శ్మశానవాటికను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వాస్తవాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లి స్టే ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అక్రమ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కేసు పరిష్కారం అయిన తర్వాత శ్మశానవాటికలో అన్ని సౌకర్యాలు కల్పించి అప్పగిస్తామని కుర్మసంఘం నాయకులకు తలసాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, ఉపకమిషనర్ డాకు నాయక్, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్, కుర్మసంఘం నాయకులు శివప్రసాద్, వెంకట్‌బాబు, అరుణ్‌కుమార్, సురేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సీసీనగర్ బస్తీవాసులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

నేడు పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ వేడుకలు

మారేడుపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య నేతలతో వెస్ట్ మారేడుపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న పీపుల్స్ ప్లాజాలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గజ్జెల నగేష్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, టీఎన్ శ్రీనివాస్, పాండు యాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో..

బౌద్ధనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని యూసీడీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనాథ్ తెలిపారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ ఆంజనేయులు, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. మూడు ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేస్తామన్నారు.


చీరలను పరిశీలిస్తున్న మహిళలు

కళా సిల్క్స్ చేనేత ప్రదర్శనకు విశేష ఆదరణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పద్మారావు నగర్‌లోని కొత్త కామకోటి కల్యాణ నిలయం హాల్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్స్ హస్తకళా చేనేత ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోందని నిర్వాహకుడు వినోద్ నేగి అన్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకట గిరి, భాగల్‌పూర్, కాంతా వర్క్స్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశం ఉచితమని, వారం రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని వినోద్ నేగి తెలిపారు.

పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బహ్మోత్సవాలు ప్రారంభం

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శివాజీనగర్‌లోని వేంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంకురార్పణ పూజలతో మంగళవారం ప్రారంభం అయ్యాయి. బ్రహ్మోత్సవాలు అక్టోబరు 2వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి కేపీ సత్యమూర్తి తెలిపారు. 24న శేష వాహన సేవ, 25న కల్పవృక్ష వాహన సేవ, హంసవాహన సేవ, 26న గరుడవాహన సేవ, 27న హనుమత్ వాహన సేవ, సింహవాహన సేవ, 28న మోహిని అవతారం, తిరుకళ్యాణం, 29న గజవాహనసేవ, 30న చంద్రప్రభ వాహన సేవ, అక్టోబరు 1న రథోత్సవం, అశ్వవాహన సేవ, 2న చక్రస్నానము, 10న 108 కలశాభిషేకము పూజలు ఉంటాయని పేర్కొన్నారు.


పల్లవి విజయవంశీ, ఆషిఖ్ హుస్సేన్‌ను సన్మానించిన బాణుక నర్మద తదితరులు

కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయవంశీ బదిలీ

● నూతన జాయింట్ సీఈఓగా ఆషిఖ్ హుస్సేన్

సికింద్రాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయవంశీ అహ్మద్‌నగర్ కంటోన్మెంట్ సీఈఓగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో జె.ఆషిఖ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఇటీవల ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసుకున్న ఆషిఖ్ హుస్సేన్‌కు ఇదే తొలి పోస్టింగ్. పల్లవి విజయవంశీ, ఆషిఖ్ హుస్సేన్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు, ఉద్యోగులు, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్ సత్కరించారు.

ఆకట్టుకున్న నిఖిత కూచిపూడి నృత్య ప్రదర్శన

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగాలీ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం కుమారి నిఖిత కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. సికింద్రాబాద్ కీస్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఆమె నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గోపాలపురం హెడ్ కానిస్టేబుల్ శివశంకర్ కుమార్తె అయిన నిఖిత కూచిపూడి నృత్యంపై మక్కువతో చిన్నప్పటి నుంచి పలు వేదికల పై ప్రదర్శనలు ఇస్తోంది.



నేడు పాస్టర్ల సంక్షేమ, సలహా కమిటీ సమావేశం

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ, సంక్షేమ శాఖ నియమించిన సలహా కమిటీ, పాస్టర్ల సంక్షేమ కమిటీ సమావేశం బుధవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో నిర్వహిస్తున్నామని క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. సమావేశానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ అలీ షబ్బీర్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ సబిత పాల్గొంటారని తెలిపారు.


తరగతి గదులను ప్రారంభిస్తున్న తత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుదీక్ష

'సరస్వతి శిశుమందిర్'లో తరగతి గదుల ఆధునికీకరణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు తత్వ ఫౌండేషన్ అందించిన విరాళంతో తరగతి గదులను ఆధునికీకరించారు. ఇసుకపల్లి రామచంద్రరెడ్డి, తత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ముదిరెడ్డి సుదీక్ష తరగతి గదులను మంగళవారం ప్రారంభించారు. శ్రీవెంకటసాయి సిరామిక్ ఆర్ట్స్ ఎండీ దామోదర్‌రెడ్డి ఉచితంగా టైల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యామిని, సెక్రటరీ జీవన్ కుమార్, ఆనంద్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్కాతమ్ముళ్ల అదృశ్యం

బౌద్ధనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్కాతమ్ముళ్లు అదృశ్యమయ్యారు. సీతాఫల్‌మండి ఇందిరానగర్ కాలనీకి చెందిన నాగినేని శాంతి(40 వివాహం గతనెలలో జరిగింది. ఆమె తల్లికి కంటి ఆపరేషన్ జరగడంతో శాంతి తల్లివద్దే ఉంటుంది. ఆమె తమ్ముడు ప్రదీప్(39) మానసిక దివ్యాంగుడు. ఈనెల 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు శాంతి, ప్రదీప్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో ప్రదీప్ అన్నయ్య రాణాప్రతాప్ సోమవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగినేని శాంతి, ప్రదీప్

ఎమ్మెల్యే పద్మారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) స్వర్ణలత

\- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



అన్నదానం

బోయినపల్లి బాపూజీనగర్ శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయం వద్ద మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు పుట్టి నరసింహ, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్, రామారావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

\- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



రోడ్డుపై మురుగు పరుగు

అడ్డగుట్టలో మురికి నీరు నిత్యం రోడ్డుపై పారుతోంది. జలమండలి అధికారులకు ఫోన్ చేసినా ఫలితం లేదని ప్రజలు వాపోయారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

\- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

